

# డాక్టర్ చెప్పిన కథలు

## - డా.శైలజ చందు



## 19వ కథ

**మెలకువగా** ఉన్నప్పుడు కన్న కలలు, నిజం కావాలంటే నిజం కావాలంటే మెలకువ అవసరం. అంతే కాదు, నిద్ర మానుకోవడానికి సిద్ధ పడాలి.

కల నిజమయ్యాక కూడా, నిద్రని త్యాగం చేయాల్సి వస్తే.

డాక్టర్లు అలాంటి కలలే కంటారు.

కోరుకున్న బ్రాంచ్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యాలన్న కల.

కల నిజమై, పీజీ లో చేరాక తినడానికి టైముండదు. రాత్రి పదింటికి పడుకుని ఆరింటికి నిద్ర లేవడం అత్యాశ అవుతుంది. ప్రొఫెసర్ల చేతిలో దులుపుకోలేనన్ని అక్షింతలు. ప్రతిరోజూ పడుతుంటే పడుతుంటే ఎన్నని దులుపుకుంటాం.

ఏదోనాటికి అవే పోతాయిలే అనుకుని నిశ్చింతగా చిరునవ్వుతో బతకడం అలవాటవుతుంది.

డాక్టర్లంటే సిగ్గులేని వాళ్ళని కాదు నా ఉద్దేశం.

పీజీ చెయ్యాలని తపిస్తారు. తపనలో ఉన్నవారికి , జరిగేవన్నీ తప్పవనీ, తప్పించుకోలేమనీ తప్ప, ఏదీ తప్పుగా అనిపించదు.

కానీ ఎంతో మంది డాక్టర్లకు, మీ జీవితం లో ఇష్టమైన భాగం ఏదంటే, నా పీజీ అంటారు.

'ఎంత పని ఉండేది. ఎంత పని చేసే వాళ్ళం. ఎంత హడావుడి. ఆ రోజులే గోల్డెన్ పీరియడ్" అంటారు.

కష్టం అయ్యాక తెలిసే నిజమేమిటంటే, కష్టంలోనే సుఖం ఉందని.'

పోస్ట్ గ్రాడ్యుయేషన్ టైం అంటే చాలా మంది డాక్టర్లకు ఎందుకంత ఇష్టమో ? బహుశా మన మీద మనకు నమ్మకం కలిగేది, మనమేమిటో మనకు, తోటివారికి తెలిసేది ఆ టైం లోనే కావడం వల్లనేమో !

పద్మ పీజీ చేసే హాస్పిటల్ చాలా బిజీగా ఉంటుంది. పీజీ అయ్యాక తను తెరవబోయే క్లినిక్ కూడా , పేషంట్ల హడావుడితో బిజీగా ఉంటుందనీ, చేతి నిండా పని ఉంటుందనీ ఊహలు , ఆశలు కలిసిన ఆలోచనలు మురిపించబోయాయి.

ఆ అపోహల పల్లకీ ప్రయాణం వదిలి, నేల మీద నడిచే అమ్మాయి, పద్మ.

నిలకడ తెలిసిన అమ్మాయి.

ఆశనీ, నిరాశనీ సరి సమానంగా, అదుపు చెయ్యగల గట్టి పట్టుదల గల అమ్మాయి.

క్లినిక్ లో కూర్చున్న మొదటి రోజున చాలా సందడిగా గడిచింది. తెలిసినవాళ్ళంతా విచ్చేసి, వాళ్ళ మీద స్టెత్ స్కోప్ ఆనింపజేసుకుని, పద్మని ఆనందింపజేసి , వందలతో పర్సుని నింపేసి వెళ్ళారు.

మరుసటి రోజున తెలిసిన శ్రేయోభిలాషి వచ్చాడు. పద్మని అలా కుర్చీలో చూస్తుంటే, సంతోషంతో గుండె నిండి పోతోందన్నాడు. పద్మ ఫ్లాస్క్ లోంచి కాఫీ తాగుతూ,

"డా. చక్రపాణి గారున్నారే, నీ బ్రాంచే. పొద్దున్న పాలు తీసుకురమ్మని మీ పిన్ని పంపితే ఆయన హాస్పిటల్ వైపెళ్ళాను. క్యూలో తన్నుకుంటున్నారు జనాలు"

"ఎందుకూ, పాలకోసమా?"

"కాదమ్మాయ్. చక్రపాణిగారి హాస్పిటల్ ముందు తెల్లవారుజామున నాలుగింటికే క్యూ కడతారు. గొప్ప హస్తవాసి ఉన్న డాక్టర్. మహానుభావుడు. ఆయనుండగా ఇంకో డాక్టర్ వైపు పేషంట్లు రావడం కష్టం. నన్నడిగితే నువ్వు వేరే ఏదైనా బ్రాంచ్ లో స్పెషలైజేషన్ చేసుండాల్సింది."

"అడక్కుండానే అన్నీ చెప్తున్నావు, ముందు చెప్పకపోయావూ?"

"నీ దుంప తెగా, నీ మాట కరుకే గానీ , మనసు మాత్రం ..."

"అదింకా కరుకు"

"సరే , ఎవరదృష్టం ఎవరు చూడొచ్చారు. నీక్కూడా పేషంట్లొస్తారేమో ఎవరు చూడొచ్చారు. "

పద్మని ఓదార్చబోయాడు.

"ఏందుకు బాధ? ఎవరూ రాకపోయినా మీరొస్తారుగా. రేపు కూడా పాలు దొరక్కపోతే , కాఫీకి ఇక్కడికే రండి బాబాయ్" అని ఓదార్చి పంపింది.

రెండు రోజుల తర్వాత , ఆ ఊరి డాక్టర్ల సంఘం ప్రెసిడెంట్ వచ్చాడు.

తెల్లని మడత నలగని ఖద్దరు బట్టలు. సొగసైన నడక. మాట తీరుకూడా మర్యాదగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఫిజిషియన్ గా ప్రాక్టీసు ఎంత ప్రమాదంగా ఉందో, పాత రోజులకూ, ఈ కాలానికీ గల తేడాలు చెప్పాడు. పేషంట్లతో నడుచుకోవాల్సిన ప్రవర్తనా నియమావళి కూడా వివరించాడు.

డాక్టర్లందరి మధ్యా చక్కటి సంబంధాలవసరమన్నాడు. ఊళ్ళో గొప్ప డాక్టర్లందరి పేర్లూ చెప్పి, వాళ్ళందరితోనూ ఎంత దగ్గర సంబంధాలున్నాయో, ఆ స్నేహాలు సాయంకాలం తర్వాత ఎలా వికసిస్తాయో చెప్పాడు. వాళ్ళందరూ కొన్ని కేసుల్లో ఇరుక్కుని గిలగిలలాడుతుంటే, తానెలా సహాయం చేశాడో ఉదాహరణలతో సహా చెప్పాడు. టెన్షన్ లో ఉన్నపుడు ఏ డాక్టర్ ఎలా నీరుకారిపోతాడో అందరి వివరాలూ తన దగ్గరున్నాయన్నాడు.

ఫలానా డాక్టర్లు, ఫలానా పరిస్థితుల్లో పేషంట్ల వల్ల ఎలా ఇబ్బందుల్లో పడ్డారో చెప్పాడు. అలా పడిన వారిని వెంటనే డాక్టర్లను, నూతిలో పడ్డ బకెట్ ని గేలం తో లాగి బయటపడేసినంత సులభంగా తానెలా బయట పడవేశాడో వివరించాడు.

ఆమెక్కూడా అవసరం వచ్చినపుడు తప్పక సహాయ సహకారాలందిస్తామని చెప్పి తన కార్డిచ్చాడు.

ఆ కార్డ్ మీద డా. బుచ్చి బాబు అని ఉంది తప్ప ఏం డిగ్రీనో రాసి లేదు.

డిగ్రీలకు అతీతుడైన ఆ డాక్టర్ కార్డ్ ని, కాళ్ళ దగ్గరున్న బుట్టలో పడేసింది.

రెండు రోజుల తర్వాత, ఇంకెవరో ఒకాయన తమ ఊరిపేరు చెప్పి అక్కడినుండి వచ్చానన్నాడు. గత పదిహేనేళ్ళుగా ఒకే డాక్టర్ దగ్గరకు నమ్మకంగా వేలమంది పేషంట్లను తోలుకెళ్ళాడట. అయినా ఆ డాక్టర్ కు కృతజ్ఞత లేదనీ, ఈ మధ్యనే తాజాగా ఆ డాక్టర్ నికృష్టుడన్న సంగతి తెలిసి వచ్చినందనీ చెప్పాడు.

అదే డాక్టర్ డయాగ్నొసిస్ రాని దద్దమ్మ, ట్రీట్ మెంట్ ప్లాన్ రాయలేని చవట, సన్నాసి కూడా అట. ఇక నుండీ , తన నమ్మకమైన సేవలన్నీ పద్మకేనని నమ్మకంగా చెప్పాడు.

తోడొచ్చిన బామ్మర్దికి ఫ్రీగా చూసి పెడితే, రేపొద్దున్నే ఊరినుండి వందమంది పేషంట్లను జబ్బున్నా, లేకపోయినా తోలుకొస్తానన్నాడు.

పేషంట్ ని చూసిన తర్వాత, అతను ఏదో చెప్పబోతుంటే

ఆపి,

"మరీ వందమందిని ఒకేసారి తీసుకు రావొద్దయ్యా, ప్రస్తుతానికి , వెయిటింగ్ హాల్లో ఇరవై కుర్చీలే ఉన్నాయి. వంద కుర్చీలు కొన్నాక నేనే నీకు కబురు చేస్తా . సరేనా!"

వెలుగు చూడాలనే కోరిక చీకట్లోనే కూర్చోనివ్వదు. ప్రకాశం కనిపించేవరకూ ప్రయాణింపజేస్తుంది.

దాహం తీరాలంటే నది దగ్గరకే వెళ్ళాలి.

పేషంట్లను చూడడ , పనిచెయ్యడం ఒక వ్యసనం. మానేద్దామన్నా మానలేని వ్యసనం. పక్కనే ఉన్న హాస్పిటల్ లో సీనియర్ డాక్టర్ కు అప్పుడప్పుడు సహాయం చెయ్యడానికి వెళ్ళేది. ఆమె పనితీరు ఆయనకు త్వరలోనే తెలిసి వచ్చింది.

ఎంత ఓపీ ఉన్నా సరే, ఓపికగా చూస్తుంది. ఎవర్నీ ఎక్కువ సేపు వెయిట్ చేయించదు. పేషంట్లను త్వరగా చూడగలదు . అలా అని ఇది వరకు ఒక్క విషయమూ మిస్ అవదు. మనిషి చురుకు . మాట మరింత చురుకు .

పద్మ కేసు చూసే పద్ధతికి ఆయన చాలా ముచ్చట పడేవాడు. కేసు తాలూకు చిన్న విషయాలు కూడా, ఆమె జాగ్రత్తగా చూస్తుంటే, నాకైతే అసలీ విషయమే గుర్తు వచ్చి ఉండేదికాదే' అని అనుకునేవాడు.

ఓ రోజున పద్మ తన క్లినిక్ లో కూర్చుని ఉండగా, ఆయన ఫోన్ చేశాడు. నీ కోసం ఒక కేసుంది వచ్చి చూడమని.

పేషంట్ వయసు పాతికేళ్ళుంటాయేమో. ఇంకా పెళ్ళికాలేదు. కేజీన్నర బరువు ఫైల్ తో, తండ్రి పక్కన కూర్చున్నాడు. తండ్రీ కొడుకుల మొహం లో ఏ భావమూ లేదు. అప్పటికి ఎంతో మంది డాక్టర్ల దగ్గరకు వెళ్ళీ వెళ్ళీ విసిగిపోయారేమో, యాంత్రికంగా చూస్తున్నారు.

పక్క సిటీలో పేరుమోసిన వాళ్ళందరూ చూసేశారట.

డాక్టర్ల పేర్లు వింటుంటే " అందరూ మహామహులు. తనకేమీ మిగిల్చే మనుషులు కాదే" అనుకుంది.

నెల నుండీ జ్వరం వస్తోంది. మనిషి బరువు తగ్గిపోయాడు. పెళ్ళీడు అబ్బాయికి 'జ్వరం, బరువు తగ్గాడు' అంటే ఏ వ్యాధికి అనుమానపడతారో దానికి సంబంధించిన మిగతా లక్షణాలన్నీ ఉన్నాయి కానీ, ఆ టెస్ట్ మాత్రం నెగటివ్ అనే వచ్చింది.

"ఇదివరకెట్టా ఉండేవోడని. చందమామకు చొక్కా తొడిగినట్టుండేవాడు." తోడుగా ఉన్న పెద్దమనిషి చెప్తున్నాడు. పేషంట్ చుట్టంలా ఉన్నాడు.

"బాబాయ్, డాక్టర్ గారికి చుట్టుపక్కల బాగా పేరుంది. డాక్టరమ్మ కూడా బాగా చూస్తారు. " అని పద్మ తెలియకపోయినా ఆమెకో కితాబు పడేశాడు.

అతని వంక చూసింది. చొక్కా యొక్క ముఖ్యమైన విధులను నిర్వర్తించనీయకుండా, కొన్ని గుండీలకు స్వేచ్ఛ ప్రసాదించాడు గనక చొక్కా వేసుకున్నా వేసుకోనట్టే ఉన్నాడు.

అతని వంక ఎవరా అన్నట్టు చూసింది . పద్మ చూడడం గమనించి, ఆమె పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చుని, రూం లో ఉన్న అందరికీ వినిపించేలా ఆమెతో, రహస్యంగా, గుస గుస సంభాషణ మొదలెట్టాడు.

"పెళ్ళీ అదీ చేసి పంపు బాబాయ్. కుర్రాడు ఒంటిగా ఉంటే చెడిపోతాడు అని మేము చెప్తానే ఉన్నాం మేడం. బాబాయికేమో తెలియకపోయె"

అతని మాటలు పట్టించుకోకుండా చూసింది.

"డాక్టర్లు , మీకు తెలియనిదేముంటుంది" అని నవ్వాడు. డాక్టర్లంటే సిగ్గు ఎరగని మనుషులన్న ఒక సిగ్గులేని అభిప్రాయం ఉందని ఆ నవ్వులో అర్థమైంది.

"అదే డాక్టరమ్మా, నేను నా కొడుకుని కూడా ఉద్యోగానికి పంపించా. ముందు రోజున అన్నీ ఇవరంగా మాట్టాడి పంపాను. పిల్లల్తో ఫ్రెండ్స్ మాదిరి ఉండాలిగదా.

"------------"

ఆయన కొడుక్కి స్నేహితుడిలాగా ఏం చెప్పాడో ఊహించింది.

కొంత మందికి సంస్కారం లేని హార్మోన్స్ ఎక్కువ మోతాదులో పని చేస్తుంటాయి. అధిక హార్మోన్లతో బాధపడుతున్నట్టు అందరికీ తెలియాలన్న తాపత్రయం వారిని ఆగనివ్వదు. ఎలాంటి సంభాషణనైనా అటువైపుకే నడిపించుకు పోతుంటారు.

పట్టించుకోకుండా ఫైల్ వంక చూస్తోంది, పద్మ ఏమీ మాట్లాడకపోయినా సరే

"నేను అన్నీ ఓపెన్ గా మాట్టాడేసుకుంటాం. ఒరే అబ్బాయ్, కుర్రాళ్లకి తప్పు చెయ్యాలనిపిస్తది. అందులో తప్పులేదు. తప్పు చెయ్యి , కానీ జాగ్రత్తగా చెయ్యి అని చెప్పి పంపించానండీ."

ఆ తప్పు పురాణ పండితుడికి చెప్పు సన్మానం చేస్తే అన్నట్టు చూసి, ఇతనితో మాటలెందుకులే అని ఆపుకుంటోంది.

"ఈడికేమో చెప్పేసరికే మించిపోయింది. ఎయిడ్స్ వచ్చేసింది. దానికేమో మందులేకపోయె. కుర్రోళ్ళు కదా కంట్రోల్ ఉండదు. "

పులి మీద ఎక్కిన పులిరాజులా ఉన్నాడు. స్వారీ తప్ప బ్రేకు వెయ్యడం రానట్టు అతని మాటలూ ఆగడం లేదు.

సంభాషణ కంట్రోల్ తప్పిపోతోందని

"సరే" అంది ఇక ఆపుతావా అన్న అర్థం వచ్చేలాగా.

"పేషంట్ ని చూడాలి. కాసేపు బయట కూర్చోండి" అని సహనం తెచ్చి పెట్టుకుని చెప్పింది.

బెల్ కొట్టింది.

"సార్ ని బయట కూర్చోబెట్టు" లోపలికి వచ్చిన నర్స్ తో చెప్పింది.

అక్కడున్న వాళ్ళలో సార్ అనగలిగిన మనిషెవరో నర్సుకి అర్థం కాలేదు.

"ఎవరు మేడం."

"వెళ్ళు బాబాయ్ , డాక్టరమ్మ ప్రసాద్ ని పరీక్ష చేస్తదంట" పేషంట్ తండ్రితో అన్నాడు. అతనెంత మాట్లాడుతున్నా, పేషంట్ తండ్రి ముఖంలో కోపం కనిపించడం లేదు.

"ఆయన్ని కూర్చోనివ్వండి. వీళ్ళతో కొంచం మాట్లాడాలి."

"బాబాయికి ఏం చెప్పాలో తెలియదు." అన్నాడు కదలకుండా.

"నాకు తెలుసులే ఎలా చెప్పించాలో!" నువ్వెళ్ళు అన్నట్టు చూసింది.

పద్మ మాటలో కరుకుదనానికి లేచి నుంచున్నాడు.

"జాగర్త బాబాయ్, అన్నీ ఇవరంగా చెప్పండి. రోగం దాచుకోకూడదు. డేంజర్" అంటూ బయటికెళ్ళాడు.

పేషంట్ నీ , అతని తండ్రినీ చూసింది. నైరాశ్యానికి అడ్రసులా కూర్చుని ఉన్నారు. అంతమంది పెద్ద డాక్టర్లు సరి చెయ్యలేని జబ్బుని ఈ చిన్న డాక్టరమ్మ ఏం చెయ్యగలుగుతుందన్న ఏమీ చెయ్యలేదన్న నమ్మకమో , ఇదేం కుదిరే వ్యవహారం కాదన్న అపనమ్మకమో ఏదీ అర్థం కావడం లేదు.

అడగాల్సినవి అడిగింది. అలవాట్లు కనుక్కుంది. ఉద్యోగం చేసుకుంటూ హాస్టల్ లో ఉన్నాడు. డబ్బంతా తండ్రికే పంపిస్తున్నాడు. జ్వరం వల్ల ఉద్యోగానికి రెండు నెలలనుండీ వెళ్ళలేదు. బాగా చిక్కి పోయి ఉన్నాడు. ఎముకలు కనిపిస్తున్నాయి.

పరీక్ష చేసింది.  పొట్ట తడిమితే, దుప్పటికింద గింజల్ని తడిమినట్టుంది. అనుమానంగా అనిపించి

"ఒక సారి స్కాన్ తీయిద్దాం." అని చెప్పింది.

రూం లో అడ్మిట్ చేసింది.

మధ్యాహ్నం రెండు కావొస్తోంది. ఇంటి దగ్గర్నుండి ఫోన్ వచ్చింది భోజనానికి వస్తున్నావా, పంపించమంటావా అని

వస్తున్నా అని చెప్పి, అతని ఫైల్ తెరిచి చదవడం మొదలు పెట్టింది.

అక్షరం వదలకుండా చదివింది. అన్ని పరీక్షల రిపోర్టులూ చూసింది. పరీక్షల సారాంశం అంతా చూశాక, అతనికి జ్వరం ఎందుకు వస్తోందో కారణమేమిటో ఎక్కడా కనుక్కోలేకపోయారు.

ఫైల్ మూసేసి బయటికి వచ్చింది.

ఇందాక వచ్చిన మనిషికి దాదాపు ఢీ కొట్ట బోయింది. అతను తలుపు బయటే నిల్చుని ఉన్నాడు. కోపంగా చూసింది. హడావుడిగా చొక్కా గుండీలు పెట్టుకుంటూ,

"డాక్టరమ్మా, మరి ఏంటి సంగతి?"

"ఏ సంగతి?"

"అదేనమ్మా, చెప్పుకోగూడని వ్యాధి గదా అని బాబాయి ఒకటే దిగులు పడుతున్నాడు. "

"అంత చెప్పుకోగూడనిదేమీ లేదు " నోర్మూస్తావా అన్నంత కటువుగా ఉంది పద్మ గొంతు.

"అదేంటి, మా వూరంతా ఘూబరా ఎత్తి పోతంటే, ఏం లేదంటారు?"

"మీకు నచ్చిన రోగం అతనికి రావాలని, ఆశపడితే సరిపోతుందా. అసలా రోగం ఆ అబ్బాయికి ఉండాలి కదా."

"మా బాబాయి  తట్టుకోలేడని విషయం మీరు దాస్తున్నారేమో మీరు "

"అదేమైనా బాంక్ లోడబ్బా దాచుకోవడానికి?"

“డాక్టరమ్మా, ముదిరితే కష్టం కదా"

"ఏంటి ముదిరేది, పైత్యం. ఆ అబ్బాయికి జ్వరం రావడానికి , మీ ఊహించుకునేదేం లేదు. ఒకటి రెండు రోజుల్లో తెలుస్తుంది. అప్పటి వరకూ ఓపిక పట్టండి.”

డ్రైవర్ కార్ తీసుకుని వచ్చాడు. కారెక్కడానికి వెళ్తుంటే అతను ఫోన్ లో చెప్తున్నాడు.

"పెద్దాయన లేడు. చిన్న డాక్టరమ్మ చూసింది. ఎయ్యో పరీక్షలు చేస్తదంట. "

ఫోన్ లో మాట్లాడుతున్న అతనిని దాటుకుంటూ వెళ్తుంటే, చెప్పేవి చెవి దాటలేకపోయాయి.

"పెళ్ళి అయినట్టే ఉంది గానీ, పెద్ద వొయసేంగాదు. పెద్ద అనుభవం కూడా ఉన్నట్టు లేదు."

‘ఇన్ని పరీక్షలకు చేసినా బయట పడలేదంటే, ఇక జూదు ఎంత మొండిరోగమో. ఎక్కడంటించుకున్నాడో. ఇక ఆణ్ణి ఆ బగమంతుడే కాపాడాల"

ఇంటికెళ్తూ ఆలోచిస్తోంది. రేడియాలజిస్ట్ కు ఫోన్ చేసి , పేషంట్ విషయం మాట్లాడింది. తన అనుమానం ఏమిటో చెప్పి, ‘లోపల ఫ్లూయిడ్ ని ఎనాలసిస్ కు పంపాలండీ!” అంది.

ఇంటికెళ్ళాక లంచ్ కోసం కూర్చుంది. తల్లి వడ్డించి పక్కకెళ్తే భోజనం చేస్తూ ఆలోచిస్తోంది.

చెల్లెలు అటుగా వెళ్తూ

"అమ్మా, ఇలా రా, అక్క ఏం చేస్తోందో" అంటూ తల్లిని పిలిచింది.

"బుజ్జీ, ఏమైంది నీకు అన్నం, పప్పూ కలుపుకుని తినాలి. విడివిడిగా కాదు." అని చెప్పింది.

స్కాన్ పరీక్ష చేసి, పొట్ట లోపల ఫ్లూయిడ్ ని ఎనాలిసిస్ కు పంపారు. ఆమె అనుమానించిందే నిజమైంది. పొట్టలోపల టీబీ ఇన్ఫెక్షన్ అని తేలింది. ఆలస్యం లేకుండా టీబీకి ట్రీట్ మెంట్ మొదలెట్టింది.

అమావాస్య నుండి పౌర్ణమి రావడానికి రెండు వారాలు పట్టింది. చందమామ కోలుకుని చొక్కా తొడిగినట్టే ఉన్నాడు. హుషారు వచ్చింది. చక్కగా తిరుగుతున్నాడు. మందులు ఇంకా ఎన్ని నెలలు వాడాలో చెప్పింది. మళ్ళీ ఎప్పుడు రావాలో చెప్పి డిశ్చార్జ్ చేసింది.

అతను చాలా త్వరగా కోలుకోవడం సీనియర్ పద్మని బాగా మెచ్చుకున్నాడు. పేషంట్ తండ్రి రాఘవయ్య ముఖం లో మాత్రం సంతోషం కనిపించలేదు. కొందరి ముఖాలంతే సంతోషమూ ఉండదు, దుఃఖమూ కనపడదు. అనుకుంది.

తక్కువ టైం లోనే ఆమె ప్రాక్టీసు కూడా త్వరగా పెరిగింది. వజ్రం ఎక్కడున్నా మెరుస్తుంది. దాని గుణమే అంత.

కొన్ని నెలలు గడిచాక ,ఓ రోజు క్లినిక్ కు వెళ్ళే సరికి రాఘవయ్య ఎదురు చూస్తూ ఉన్నాడు. ఆ పేషంట్ తండ్రి. పద్మ కారు దిగగానే నమస్కారం చేసి పక్కనే నిల్చున్నాడు. ఎప్పటిలానే ముఖంలో ఏ భావమూ లేదు.

వెంట కొడుకు లేడు. ఒక్కడే వచ్చాడు. ఓపీ అంతా అయ్యాక లోపలికి పిలిచింది. లోపలికి వచ్చి నిల్చునే ఉన్నాడు.

కూర్చోమంటే తలూపి తన వెంట తెచ్చిన సంచిలో నుండి ఏవేవో తీసి టేబిల్ మీద సర్దు తున్నాడు.

నది కానుకునే లంకల్లో ఉంటారట. అక్కడ దొరికేవన్నీ తెచ్చాడు. సీమ చింతకాయలు, చెరుకు ముక్కలు, పచ్చి మామిడికాయలు, మట్టితో బాటు మెరిసిపోయే వేరు శనగ కాయలు, ఎర్ర చిలగడ దుంపలు, చిన్న చిన్న ఉసిరి కాయలు.

వాటినన్నింటినీ చూస్తుంటే, పద్మకు చిన్ననాటి జ్ఞాపకాలు నిద్రలేస్తున్నాయి. సీమ చింత కాయల్ని చూస్తోంది. కొన్ని పెద్ద సైజు ముత్యాల్లా ఉంటే, కొన్ని మిగల పండి, కెంపుల్లాగా మెరుస్తున్నాయి. పేషంట్లు తెచ్చే ఆ చిరుకానుకలను ఇష్టపడకుండా ఉండాలంటే కొంత స్థితప్రజ్ఞత అవసరం అనుకుంది. అదేదో కాస్త సీనియర్ అయ్యాక సంపాదించ వచ్చులే అనుకుని, వాటి వంక ముచ్చట పడుతూ చూస్తోంది.

మొహమాటానికైనా వద్దనాలని ఎప్పటికో తట్టింది కానీ అప్పటికే లేటయ్యింది. వాటివంక చూస్తూ "ఎందుకివన్నీ" అంది. బలహీనంగా పలికిన గొంతులో బలహీనత అంతా వినిపించింది.

"ఇదేమంత భాగ్యం. మీకు దొరకవనీ తెచ్చాను"

"ప్రసాద్ ఎలా ఉన్నాడు"

"మీ దయ వల్ల బాగున్నాడమ్మా. ఉద్యోగంలో చేరాడు."

"ఎప్పుడొస్తున్నాడు?"

"ఏమోనమ్మా?" అంటూ సంచీలో చివరిది తీశాడు. పెద్ద సీసాలో పాలు ఉన్నాయి. "మా సాంబడింట్లో గేదె ఈనిందమ్మా. తొలినాటి జున్నుపాలు. గట్టి అవుద్దేమో, మామూలు పాలు కలుపుకోండమ్మా" అని బాటిల్ టేబిల్ మీద పెట్టాడు.

అమ్మో జున్ను. అనుకుంది.

రాఘవయ్య వెళ్ళగానే 'ఇంటికి ఫోన్ చేసి, డ్రైవర్ తో ఇవన్నీ ఇంటికి పంపించి, అమ్మతో చెప్పి' మనసు ఏవేవో ప్లానులేస్తోంది.

'బెల్లం తో పాటు మిరియాలు వెయ్యాలమ్మా. లేపోతే వాతం చేస్తది" ప్రొఫెసర్ పాఠం చెప్తున్నంత సీరియస్ గా ఉన్నాడు.

అన్నీ అమర్చాక , రాఘవయ్య అక్కడే నిల్చున్నాడు. ఎప్పటిలానే ముఖం గంభీరంగా ఉంది. కాస్త సంతోషంగా ఇస్తే బాగుండుకదా. మరీ ఇలా నిరుత్సాహంగా ఇస్తే ఎలా తీసుకునేది.

పద్మకు నిరుత్సాహంగా అనిపించి, టేబిల్ మీద వాటిని చూసి, వీటిని స్టాఫ్ కు ఇచ్చేస్తా. నాకేమొద్దు' అని మనసులోనే అలిగి కూర్చుంది.

రాఘవయ్య నవ్వుతూ ఇవ్వాలి. అప్పుడే తీసుకోవాలనుకుని

"ఇంక అంతా బాగానే ఉందికదా. సంతోషమేగా" అంది.

"దేనికమ్మా సంతోషం?"

"ఏం, ప్రసాద్ కు బాగయ్యింది కదా? సంతోషంగా లేదా.?"

"ఏం సంతోషంగా ఉండమంటావు తల్లీ, ఊరు ఊరంతా ఏకమై నాకొడుక్కి ఎయిడ్స్ అన్నారు. ఎంత ఎలేసినట్టు చూశారో మీకెట్టా చెప్పేది. నేనూ మనిషినే గదా. సంతోషం ఏడనుండి తెచ్చుకునేది. ఒక్కళ్ళు మా ఇంటికి రాకపోతిరి. గుడికెళ్ళినా ఎడంగా కూసోబెట్టారు తల్లీ. దేవుడికైనా దయలేకపోయింది మామీద. బస్సులో నా పక్కన కూర్చునే మడిసి లేకపోయాడు. ఏడ నుండి తెచ్చుకోమంటావు నవ్వు.

నీతో చెప్పి ఏం లాభం లే. నీ పని నువ్వు చేశావు. మా వాడికి మందులిచ్చి బాగు చేశావు."

పద్మ ఆశ్చర్యంగా అతనివంకే చూస్తోంది. కాసేపాగి మళ్ళీ అన్నాడు.

"ఎన్నెన్ని మాటలు పడ్డామో, అయ్యన్నీ విని నేనూ, మా యాడదీ సచ్చిపోదామనుకున్నాం. ఆడు ఒంటరి అయిపోతాడని ఆగామంతే. ఇప్పుడైనా పేరుకే బతికున్నాం. వాళ్లన్న మాటలకు ఏనాడో చచ్చిపోయాము. " అంటూ కళ్ళొత్తుకున్నాడు.

"ఊరుకో రాఘవయ్యా" పద్మ లేచి వచ్చి, అతన్ని కుర్చీలో కూర్చోబెట్టింది. చాలా రోజుల తర్వాత మనిషి స్పర్శ తగిలిందేమో. అతని గుబులంతా కళ్ళలోకి వచ్చేసింది. పద్మ చెయ్యి పట్టుకుని ఏడుస్తుంటే, ఏడవనిచ్చింది.

కొంత సేపటికి తనంత తానే సంబాళించుకున్నాడు. ఊరికెళ్తానని లేస్తే, భోజనం చేసి వెళ్లమంది.

"లేదమ్మా, భోజనం ఏళకాలేదింకా. ఇంటిదగ్గర అది ఎదురుచూస్తా ఉంటది" అని లేచాడు.

రాఘవయ్యని బస్టాండ్ లో దింపమని డ్రైవర్ తో చెప్పి లోపలికి వచ్చింది. టేబిల్ మీద రాఘవయ్య పెట్టినవన్నీ చూస్తూ కూర్చుంది.

చేతిలో పట్టినన్ని వేరు శనక్కాయలను మాత్రం బాగ్ లో వేసుకుని, స్టాఫ్ ని పిలిచి, "ఇవన్నీ పంచుకోండి" అంది.

వెళ్ళబోతూ రాఘవయ్య చెప్పిన మాటలే వాళ్ళకూ చెప్పింది. "జున్ను పాలలో మిరియాలు వేసుకోండి. మిరియాలు ఘాటు. తక్కువగా వేసుకోండి."

వాస్తవాలు కూడా మిరియాలు లాంటివే. ఘాటుగా ఉంటాయి.

ప్రతి ఆదివారం పద్మ చుట్టు పక్కల పల్లెలకు ఆరోగ్యం మీద అవగాహన కాంప్ లు నిర్వహించడానికి వెళ్తుంది. ఈసారి కాంప్ రాఘవయ్య ఊరిలో ఏర్పాటు చెయ్యమని ఆర్గనైజర్స్ కు చెప్పింది. కాంప్ ముందు మీటింగ్ జరగాల్సి ఉంది. ఆ ఊరి ప్రజాప్రతినిధికి తీరిక లేకపోవడంతో జరగలేదు. పేషంట్లనందరినీ చూసే సరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. నాయకుడికి తీరికయినట్టు, ఆయన వస్తున్నట్టు కబురు అందింది.

ఆయన పద్మతో చాలా మర్యాదగా మాట్లాడి, వివరాలవీ కనుక్కున్నాడు. మైక్ అందుకుని, అమెరికా రాజకీయాలు, పక్కరాష్ట్రాలను కుదిపేస్తున్న ఉద్యమాలు, తమ నాయకుడి తపన , నాయకత్వ పటిమ గురించి వివరించి , మైక్ పద్మ చేతికిచ్చాడు.

ఎక్కువ ఉపోద్ఘాతం లేకుండా మొదలెట్టింది.

"ఇప్పుడు ఆరోగ్యం గురించిన వివరాలు టీవీల్లో, కంప్యూటర్లలో ఫ్రీగా దొరుకుతున్నాయి. సరైన దారిలో పొందని విజ్ఞానం ఒకోసారి ప్రమాద కరమే. కొన్ని వివరాలు డాక్టర్ ద్వారా తెలుసుకోవడమే మంచిది. శంఖంలో తీర్థం లాగా.

నేనీ ఊరికి రావడానికి ముఖ్య కారణం రాఘవయ్య. వాళ్ళ అబ్బాయి నా పేషంట్. అతనికొచ్చిన జ్వరం ఏదో వ్యసనం వల్ల వచ్చింది కాదని చెప్పాలనే వచ్చాను. జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం ఇలాంటి లక్షణాలు ఒక్క ఎయిడ్స్ లోనే కాదు. వేరే కారణాల వల్ల కూడా జరగొచ్చు.

ప్రసాద్ కు జ్వరం రావడానికి వేరే కారణం ఉంది. అతనికి వచ్చిన జబ్బు, నాకైనా, మీకైనా, మనలో ఎవరికైనా వచ్చే అవకాశం ఉంది. జబ్బు రావడం, వచ్చిన వాళ్ళు చేసిన తప్పు కాదు. రోగాన్ని, నేరంగా పరిగణించడం , ఆ కుటుంబాన్ని దూరం పెట్టెయ్యడం, వారిని మానసికంగా ఎంత దెబ్బ తీస్తుందో అర్థం చేసుకోండి. ఆ వ్యాధి మనలో ఎవరికైనా వస్తే, ఆ అవమానాలు మనకే జరిగితే , తట్టుకోగలమా?

మందులు వాడాము. జబ్బు తగ్గిపోయింది. ఇవాళ ప్రసాద్ ఆరోగ్యంగా ఉన్నాడు. సంతోషంగా ఉంది. అలాగే ఒకందుకు బాధగా కూడా ఉంది , మన ప్రవర్తనకే ఏ మందూ లేదు.

సంస్కారం అన్నది ఏ మందులతో వస్తుంది? "

స్టేజ్ మీద నుండి దిగాక , అందరి మధ్యా ఉన్న రాఘవయ్య దగ్గరకు వెళ్ళింది.

"మీరేం బాధ పడకండి. ప్రసాద్ మంచి అబ్బాయి. నేను చూశానుకదా. అబ్బాయి పెళ్ళికి పిలవడం మర్చిపోవద్దు" లంచ్ రెడీ అయిందని ఆర్గనైజర్స్ చెప్పారు.

"ఏమనుకోవద్దు. నేను రాఘవయ్య కోసమే వచ్చాను. వాళ్ళింట్లోనే నా భోజనం."

"వస్తున్నారని ముందే తెలిస్తే బాగుండేదమ్మా." రాఘవయ్య మొహమాటంతో అన్నాడు.

"ఏంటి రాఘవయ్యా, రావద్దా నేను?"

"మీకు మామూలుగా భోజనం పెట్టడానికి మనసు రావడం లేదు."

"ఏం పర్లేదు. నువ్వేం పెట్టినా తింటాను."

"ఇదంతా నా భాగ్యం తల్లీ."

"మీ ఇంటికొచ్చేది భోజనం కోసమే కాదులే పద."

పద్మ చేతులు పట్టుకుని కళ్ళ కద్దుకున్నాడు.

కళ్ళు తుడుచుకుని నవ్వాడు. రాఘవయ్య ముఖంలో ఏ భావమూ ఉండవనుకున్న పద్మకు,

దుఃఖమూ, అది తొలిగిన సంతోషమూ రెండూ కనిపించాయి.

*ఈ నెల కథ చెప్పింది మా 'పి పి ఎల్'*



*అంటే డా. పాటకమూరి పద్మలత.*

*మా పి పి ఎల్ కు దాహం ఎక్కువ. చదువు దాహం. మామూలు కొలత గ్లాసుల్తో తీరే దాహం కాదు.*

*ముందు గైనకాలజీలో స్పెషలైజేషన్ చేసింది. ఆ తర్వాత జనరల్ మెడిసిన్ లో పీజీ చేసి, ఆ పైన ఎండోక్రైనాలజీలో సూపర్ స్పెషలైజేషన్ చేసి, ప్రస్తుతం గుంటూరులో ప్రాక్టీస్ చేస్తోంది.*

*ఈ డిగ్రీలన్నీ తను కష్టపడి చదివి, పోటీపరీక్షల్లో నెగ్గి, సీటు తెచ్చుకుని సంపాదించినవే.*

*నేను ప్రేమగా "జగమొండి" అని పిలుచుకుంటాను.*

*ఆలోచిస్తే, ఈ నెల కథ వ్రాయడానికి థీం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలపాలా వద్దా అని మరీ మర్యాదస్తుల్లాగా మేము కృతజ్ఞతలు అవీ చెప్పుకోవడం, స్నేహధర్మం కాదని అనిపించినా, అయినా అందరి ముందూ బాగోదు కనక,*

*"థాంక్స్ అమ్మాయ్, పి పి ఎల్"*

*మనసున్న మా పద్మలత కలకాలం ఆరోగ్యంగా నవ్వుతూ గడపాలని దీవిస్తూ*

చందు శైలజ

COMMENTS